# ఉసుళ్లు



కథ

ఆయిటి పూనింది. మొగులు పచ్చి పచ్చిగయింది. ఎండకొడితె బండలెక్క వానకొడితె పెండలెక్కయ్యే ర్యాగటి భూములు పదనెక్కుతున్నయ్. మీద వానపడ్డట్టుంది. వాగుల మురికినీళ్లత్తన్నయ్. చాపలు ఎదురెక్కుతయని బట్టలుతుకుడు మర్చిపోయి నడివాగుల కట్టెవట్టుకొని నిల్చుంది పధ్నాలుగేళ్ల రాజవ్వ. అప్పటికి నాలుగు జెల్లలు, ఒక పాపెరగున్న, మూడు బుడ్డపరకల్ని కొట్టింది.

ఇంకో నాలుగు దొరుకుతె పులుసైతది. ఒక్క ఉల్పెకొక్కు పడ్డా చాలు. పులుసు మంచిగుంటది' అనుకొని కట్టె పట్టుకొని అట్లనే నిలవడ్డది. నీళ్లశబ్దం తప్ప అంతా నిశ్శబ్దంగా వుంది. ఓ కొంగమూతి చాప చరచరమని పాక్కుంట రాంగనే ఒక్క దెబ్బ కొట్టింది రాజవ్వ. అది చచ్చింది. కాని నీల్లల్లనే చిదుంచిదుం అయింది.

'దీనింట్ల పీనుగెల్ల... గిదేం చాప... ఒక్క దెబ్బకే తుక్కుతుక్కయింది' అనుకొని మల్లా నిల్చుంది.

రాజవ్వకు అసహనంగా వుంది. 'దొర్సాని మైలబట్టలు జెల్ది ఉతుక్కపోవాలె... చాపలు పాడుగాను. ఇంకో రొండన్న పడకపాయె... బట్టలు ఉల్లారకపోతే దొర్సాని తిడ్తది. పొద్దు గూకంగ చావు బట్టలు దెచ్చినావె అని'

ఇంకొంచెంసేపు అలాగే నిల్చుంది. ఒక్క చాప ఎదురెక్కలేదు. ఏదో చరచరమంటె కొట్టవోయింది గని... అది నీరిగట్టె అని చూసి ఆగి పోయింది.

"ఓ పోరి.. చాపలు పడ్తన్నవా? సొకతిరుకం చేత్తన్నవే? నీ బొందలెట్ట. మైలబట్టలు పొయ్యిల వెట్టి ఉడుకవెడ్తన్నవనుకున్న.. అవుతల వాన చ్చెటట్టుంది. ఏంజేత్తన్నవే" రాజవ్వ తల్లి లింగ వ్వ ఉరికురికచ్చి తిడ్తనే వుంది.

"నీ యవ్వ... మన పొయ్యిల చెట్టిరికప్ప కూసున్నది. అది మీద పడితె పెయ్యి ఎండుక పోతదని ఉడుకవెట్టలే... బట్టలన్నీ నానవెట్టిన్నే..." అంది రాజవ్వ.

"గౌరక్క పొయ్యిల ఉడుకపెట్టకపోయినవే... ఫో... బట్టలన్ని గౌరక్క కుండల పెట్టు ఫో... నేను కట్టె పుల్లలేరుకత్త... పో బిడ్డా బాంచెన్" అంది లింగవ్వ.

"ఆగే... ఇంక రెండు జిమ్మలు పడ్డా పులుసైతది. సవశేరుకు ఎక్కువే పడ్డయే. చాపలు తినక బగ్గరోజులైందే...'

"గట్లయితె మనకు తెల్లార్తదా బిడ్డా... మొన్న కొందామనుకున్న.. ఖాసింగాడు నాలుగు గాలాలేసి బాగానే పడ్తండు. పువ్వు మొట్టలని కిలకు నూర్రూపాయలు అమ్మవట్టె... నూర్రూపాయలు పెట్టుడంటె పానం తరిత్తదా బిడ్డా.. ఇగ మొగోల్లు బొంబై, బీవాండిపోయి సంపాయిత్తుంద్రని బెస్తోల్లు ఊడ్సుడు సల్లుడు బందువెట్రి. మసుకుల్నే చాపలబుట్ట వట్టుకోని జయితల మార్కెట్లకు ఉరుకవట్రి. ఊర్లె చాప దొరకకుంటయింది. శెనచావంటె తెల్వకుంట గావట్టె. దొరికిన కాడికి గోలిచ్చిపెడ్తగని... గౌరక్క పొయ్యిల మైలబట్టలు పెట్టుఫో... జెల్ది ఫో..." లింగవ్వ గద్రాయించింది.

రాజవ్వ గులుక్కుంటనే చాకలి పొయ్యి మీదున్న కుండల బట్టలు పెట్టి... గావుకేక పెట్టింది.

కె.వి.నరేందర్

"వావ్వా... బూర్ల తేలు... చటుక్కుమని పిచ్చిందే..."

చొప్ప బెండు లేరుకత్తున్న లంగవ్వ 'ఎక్కడ కుట్టింది బిడ్డా...' అని ఉరికచ్చింది.

చిన్న తేలు గునగున వోతుంటె బండతోని చంపి.... "ఏంకాదు బిడ్డా... కసరెల్లటట్టు చంపిన. గిట్లాంటియే నాకెన్ని కుట్టలే. అయిన నీకు ఇసమెక్కదే పోరి... నువ్ కడుపులుండంగ నాకోపారి తేలుగుట్టింది" అని రాజవ్వ వేలికి లంగ నాడదీసి కట్టు కట్టింది.

"నీయవ్వ... బగబగ మండుతుందే" రాజవ్వ మొత్తుకుంది.

"ఏడ్వకు బిడ్డా... కండ్లు మూసుకో..." అని థూ.... థూ... థూ.. అని తుంపిరి పడేటట్టు ఊచింది.

"ఊరికి ఉత్తరాన ఉరుం పుట్టె...
ఉరుముకు మేఘం పుట్టె...
మెరుపుకు మేఘం పుట్టె....
మేఘానికి వాన పుట్టె...
వానకి వరద పుట్టె...
వరదకి జెల్ల పుట్టె...
జెల్లకు ముల్లు పుట్టె... ముల్లరిగిపోను...
థూ.. థూ... థూ...

తేలు మంత్రం ఏసిన బిడ్డా... ఇగేం గాదు. పొయ్యి అంటువెట్టు. మైలబట్టలు నీసు వాసనత్తయ్" అంది లింగవ్వ.

"అవ్వ నీకు మంత్రాలత్తయానే" అనడిగింది రాజవ్వ.

"అస్తె వూర్లె బతుకనిత్తారు బిడ్డా... గా రామసామిని మంత్రాలత్తయని వండ్లిరుగ్గొట్టి పంచాది వెట్టలేదా... అయిదువేలు జుర్మాన తీసింద్రు గాదు... గీ తేలు మంత్రం మీ తాత నేర్పింద్రు" అని నవ్వింది లింగవ్వ. బట్టలు నీళ్లల్ల పిండి ఒడ్డుకు విసిరేసుకుంట 'జెప్పన కానియ్...' అని తొందరపెట్టింది.

"గీ మైల బట్టలుతుకుడంటె కక్కత్తదే..." రాజవ్వ మొఖం చీదరిచ్చి అన్నది.

"కులపోల్లం కదబిడ్డ... గట్లనుకుంటరా... దొర్సాని కోడలు నీళ్లాడింది. అయిదారునెల్ల దాక పీతిపేగులు, మైలబట్టలు తప్పయ్ బిడ్డా... మనమంటె ఊరికి ఆడిబిడ్డ లెక్క... దీపావళి నాడు మబ్బుల మంగళార్తి పట్టుక పోతె ఇంటికి పదిరూపాయలన్న పెడ్తరు. గీ ముచ్చట్లకేంది గని... జెట్టిన కానియ్ బిడ్డా" అంది.

రాజవ్వ బట్టలుతుక్కుంటనే చాపలు ఎదురెక్కుతున్నయేమోనని చూస్తంది. బిడ్డని గమ

నిస్తున్న లింగవ్వ

"ఇయ్యాల్ల మీ అయ్య పటేలింటికి గొర్రెను కొయ్యవోయిండు. పటేలింట్ల పోశమ్మకు వెడ్తండ్రట. కాల్లు తల్కాయ దెత్తడు తియ్" అంది.

"అయ్య పేగులు దెత్తె బచ్చెర్లు ఉడక వెట్టి బోటికూరలెక్క పటపట గోలియ్యే... కల్లోరకు మంచి గుంటది"

"వానకు పొద్దాటి కల్లు వట్టిగనే పుల్ల వడ్తది బిడ్డా... అయ్యరాంగ జీవన్‌రెడ్డి చెట్టుది కల్లు దెత్తనన్నడు."

"జీవన్‌రెడ్డి చెట్టేందే?"

"మనూరి ఎమ్మెల్లె లెక్క... గా చెట్టుకల్లు కూడా పవర్‌గుంటదట. గా చెట్టుదే దొరగార్కి వాడుక బింకి పోతది. ఇయ్యాల్ల దొర వూర్లె లేడు. నారగీడని బతిమాలి ఆ చెట్టుకల్లుదెత్త నన్నడు. జెల్దికానియ్" అంది లింగవ్వ బట్టలారేస్తూ.

"నాకైతే చాపల పులుసు వెట్టు" అనుకుంట తనూ బట్టలారేసింది రాజవ్వ.

బట్టలారేంత వరకు మల్ల కట్టె వట్టుకొని నీళ్లల్ల నిల్చుంది. ఒక కొడిపె నీళ్లని చీల్చుకుంట చరచరా ఎదురెక్కుతోంది. రాజవ్వ కట్టెలేపి దెబ్బలేయడానికి సిద్ధంగా నిల్చుంది.

అప్పుడే ఓ గొర్లమంద నీళ్లల్ల దునికింది. ఆ లొల్లికి చాప నీళ్లల్ల మునిగి కనపల్లేదు.

"గెగ్వా... మిమ్ముల్ని ఆర్నమియ్య..." కోపంగా గొర్రెల్ని అదిరిచ్చింది. చేతిలో వున్న కట్టె విసిరింది రాజవ్వ. గొంగడి కొప్పెర కప్పుకున్న రాయమల్లు వాగు ఒడ్డు మీదినించి...

"ఏందె పొల్లా... కట్టెసిరి గెదుముతున్నవ్. నీకు గత్తర్రాను... పసరుగడ్డి తిన్నయ్. నీళ్లు తాగకపోతె సత్తయ్. సిటుకు రోగాల కాలంగాదె..." అన్నడు తీగురంగ.

"ఓ నల్లమొకపోడ... నా చావ ఎగిరి పోయింది. నీ సౌటపిల్లని యాటకు పంప" రోషంగా అంది రాజవ్వ.

"నీయక్కపోరి... జాముబాగుందే నీకు... నువ్వు ఇసిరిన కట్టె తాకితె జీగునం ఉంటాదే... వాగు నీ అవ్వ జాగిరనుకుంటివా? నిన్ను కాటమయ్యకాడ బొందవెట్ట..."

"ఓ మునలోడా... బాగ ఉరుకులాడ్తున్నవ్... పంగ కాల్లోడ. నన్ను కాటమయ్యకు పెడితే నీకు దింపుడు కల్లం పెడ్తరు" అంది ఇంకింత రోషంగా.

"చూసినావె లింగవ్వ నీ బిడ్డ తిట్లు... పోరికి కాపురం బాగచ్చిందే. ఈ పోర్ని గా పడమటి పట్టెకిచ్చి పెండ్లిజెయ్యాలె. చిమ్మెట వెట్టి ముక్కుల చీమిడి దీత్తరు."

పెండ్లి మాట ఇనంగనే రాజవ్వకు సిగ్గు ముంచుకచ్చి... వ్వె...వ్వె...వ్వె... అని ఎక్కిరిచ్చింది. "ఏందె రాయమల్లన్న గా పోరి తోని... దాని నోట్లె నోరు పెట్టుటానికి దాని అయ్యనే జెనుకుతడు. అల్లని రాయమల్లన్న... రాజవ్వ పెడ్లి వెట్టుకుంటె బొల్లిమర్క నియ్యాలె నీ వంతుకు. మీ ఇల్లు పదకొండేండ్ల వట్టి నేనే ఉతుకవడ్తి..."

"గీ పోరి లగ్గానికి బొల్లిమర్కనిత్తనె... నీయవ్వ... దున్నపోతు లెక్క బలిసిన గడ్డం పోతు నిత్త... పదారు పండుగదాక ఉడుక వెట్టినా తెగద్దు..." అని నవ్వుకుంట ఆగమాగమైపోతున్న మందని అదిలిచ్చుకుంట వోయిండు.

బట్టలు గాలికి ఆరడంతో లింగవ్వ రెండు మూటలు గట్టింది.

మూటలు చెరో భుజానేసుకుని... "మైల బట్టలు గడిగడికి అవుసరముంటయ్ బిడ్డా...



దొర్సనింట్లేసి మనింటికి పోదాం" అంది.

ఇద్దరూ మూటలు భుజానేసుకొని బయల్దేరింద్రు.

** ** **

దొర్సనింటికెళ్లేసరికి... దొరసని కోడలవ్వకు గోరుగాలు వెట్టి గోర్లు తీస్తుంది అంజవ్వ. ఇత్తడి తపేలాల పసుపునీళ్లు వోసి కోడలవ్వ పెయ్యికి తీడుకుంట రాస్తంది. ఆమె అమ్మా... అబ్బా అంటు మూల్గుతుంది.

"బాలింత పెయ్యికదా బాంచెన్... ఓర్సుకోండ్రి... గిట్ల బలిమీటికి రాయకపోతె అటెనుక నడుం నొప్పి లేత్తది" అనుకుంట అంజవ్వ నూనె రాస్తంది.

రాజవ్వ, లింగవ్వ బట్టల ముల్లెలు దింపింద్రు. రాజవ్వ దొర్సని కోడల్నే చూస్తుండిపోయింది.

"జెల్దిన్నే తెచ్చింద్రేమే... ఉల్లారినయా..." అనుకుంట లోపల్నించి వచ్చింది దొర్సాని.

"ఉల్లారినయ్ దొర్సాని... మల్ల చినుకు పడితె ఇంట్ల జాగలేదు. గందుకే దెచ్చిన" అంటూ కూలవడ్డది లింగవ్వ.

"అంజవ్వా... తిన్నవె" అడిగింది లింగవ్వ.

"మీలెక్క మాకేమన్న తల్వాల బియ్యం దొరుకుతాయె... ఎసట్ల పోసి పొయ్యిమీద వెట్టుటానికి... మైలపోలు వడ్లేనాయె... వడ్లని గిర్నివట్టిచ్చి తౌడు, నూకలు దీసి వండుకోవాల్నాయె..." అని దీర్ఘం తీసింది అంజవ్వ. దొర్సని ఒడలికి తలంతా నూనె మర్దన చేస్తూ.

"కారెడ్డమారుతున్నావే... ఎనుకటి తల్వాల బియ్యంకూడ మీరే పోసుకునేటోల్లట తియ్... ఓపారి పెండ్లిల్ల ఆ బియ్యంల ఎవడో పోరడు ఏరిగిండని మాకు అప్పజెప్పింద్రట. నీ మొగుడు పోలు చిన్నగ పోత్తాడే... రెండు పల్లాల వడ్లయినా చాలయ్. మిత్తి తీసిన పైసల్తోనే మీరు యాడది బతుకచ్చు. మీకేమైందే..." అంది లింగవ్వ.

దొర్సాని బట్టలు లెక్కపెట్టుకుంట మైల్‌దాన్ల వేసుకుంటంది. ఈల్ల మాటల్తోని దొర్సాని లెక్కతప్పింది. కయ్యిన లేసింది.

"మీ కొట్లాట మొదలైందానె... మీ కులం పాడుగాను. గట్క తినెటోల్లు అన్నం తిన వడ్తిరి. అన్న తిన్నా గవ్వే పనులు చేసుడాయె. ఏమన్న మా లెక్క దొర్సాన్లా... అది నీల్లాటలు జెయ్యాల్నాయె... ఇది మైలబట్టలుతుకుడేనాయె... నీచపు కులంల పుడితె గా పనులుగాక ఇంకేం జెత్తరే... ఇయ్యల్ల నాలుగు అన్నం మెతుకులు తింటుండ్రేమో... ఒకతి తల్వాల బియ్యమంటంది... ఒకతి మైలపోలు వడ్లంటంది... బేమాను గొట్టోల్లే మీరు. మల్ల మక్కగట్కల మామిడికాయ తొక్కు అడుక్కోని తినేటి రోజులు రాకపోతయా... మేం చూడకపోతమా?'

అత్త మాటలకు దొర్సాని కోడలు కిచకిచ నవ్వింది. దొర్సాని అందర్ని కులం పేరుతోని తిడుతదని లింగవ్వకు, అంజవ్వకు ఎరుకే కాబట్టి పట్టించుకోక నోరు మూసింద్రు.

కాని... ఆ మాటలు రాజవ్వ గుండెని గాయపర్చినయ్. దొర్సానికి కోపమెక్కు వని ఊరంత తెల్సు. కాని తాము అన్నం తినే దశకు ఎదగటమే పాపమైనట్టు ఎందుకు తిడుతుందో అర్థంకాలేదు.

కాని... ఆ మాటలు రాజవ్వ గుండెని గాయపర్చినయ్. దొర్సానికి కోపమెక్కువని ఊరంత తెల్సు... కాని తాము అన్నం తినే దశకు ఎదగటమే పాపమైనట్టు ఎందుకు తిడుతుందో అర్థంకాలేదు.

కాని... ఆ మాటలు సూదుల్లెక్క గుచ్చినయ్.

మైల్‌దాన్లకెళ్లి బట్టలన్ని తీసి మల్ల లెక్క పెట్టుకుంది.

"పోయత్త దొర్సానీ..."అని లేసింది లిగవ్వ.

"ఆగవే లింగవ్వ... నీకోటి పెడుత" అని లోపలికెళ్లింది. రాజవ్వ తల్లి చెవిలో "అవ్వ... దొర్సని ఏదో పెడ్తనంటంది. మొన్ననే ఈల్లింట్ల ఇరవై ఒక్కటి అయిందికదా... కర్జెలు కారప్పూస పెద్దది కావచ్చు" అంది ఆశగా.

"గట్టిగ అనకు బిడ్డా... దొర్సాని తిడ్తది" అన్నది లింగవ్వ.

దొర్సాని చేట పట్టుకొని వస్తుంటే... నిక్కి నిక్కి చూసింది రాజవ్వ.

చేటనిండా... పురుగులు!

చచ్చిపోయిన పురుగులు!!

రాజవ్వపెయ్యిమీది రాగిరోమాలు లేసి బుగ్గ రిచ్చినయ్.

"ఓడి పట్టరాదె... ఎట్ల పట్టుకపోతవ్"అంది కోపంగ. లింగవ్వ భుజం మీది పంచెతో ఒడి పట్టింది. చేటతని పురుగుల్ని పోసింది దొర్సాని.

"వాక్... పురుగులు" కక్కొచ్చినట్టుగా అంది రాజవ్వ. దొర్సాని గుడ్లురిమి చూసింది.

"పిసపోరివానె... అవవి పురుగులా... ఉసుల్లు. మీలాంటోల్లు వాటిని ఏంచుకొని మక్క ప్యాలల్ల పోసుకొని బుక్కితె ఎంత మంచిగుంటయ్. కండ్లకు వెలుగులస్తయ్" అంది దొర్సాని.

"అవ్ దొర్సాని... గా పోరికేం తెల్సు తియ్యుండ్రి" అంది లింగవ్వ మూటగట్టుకుంట.

"నిన్న మా ఇంట్ల కరెంటు బుగ్గల కాడికి బాగా అచ్చినయ్. వాటి పాడుగాను... ఎన్నడు కనవడయ్... ఒక్క వానవడంగనె పెత్తరీ గల్లెక్కస్తయ్... రెక్కలూసిపోయి చచ్చిపోతయ్. మీరు బుక్కుతరని ఊడ్చి చాట్ల ఎత్తిన..." అంది దొర్సాని.

లింగవ్వ రాజవ్వ వెనుదిరిగారు.

దార్లో రాజవ్వ అంది "అవ్వొట్ల బుక్కుతవే... పారవొయ్యి" అంది ఒకారిచ్చుకుంట.

"ఉసుల్లను తిట్టద్దు బిడ్డా... ఆడిబిడ్డ అన్నం గాదె..." అంది లింగవ్వ.

"గా పురుగులు అన్నమెట్లయితయే..."

"ఒపారి అత్తగారింట్లున్న చెల్లెలింటికి అన్న గారు పోయిండట. చెల్లెలింట్ల అన్నం లేదు. అన్నగాడచ్చె ఎట్లని చెల్లెలు బియ్యం నానవెట్టిందట. అన్నగాడు తినకనే వోయిండట. నాన వెట్టిన బియ్యాన్ని చెల్లెలు అత్త సూడకుంట పుట్టల పారవోసింది. అవి ఉసుల్లయి లేసినయ్. అన్నగానింటికి పోయి చచ్చిపోయినయి. ఆడు జొన్నప్యాలల్ల నువ్వులు ఉసుల్లు కలుపుకొని బుక్కిండట... అందుకె ఆడబిడ్డ అన్నం పెడితె తినిరావల్నట" అని చెప్పింది లింగవ్వ.

"అవ్వా... గా కథలు ఎవలు చూడవోయిండ్రుగని... గా పురుగులు బుక్కుడేందే... ఉసుల్లంటే ఆ పురుగులు కాదు... మనమే... అవి వెలుతురు దగ్గరికి పోయినట్టు మనం కులకషితోని పెద్దోల్ల ఇండ్లల్లకు పోతం... మనం రెక్కలూసి పోతయ్... వాల్లో మనల్ని గోలిచ్చుకొని బుక్కుతరు... కాని.. ఈ ఉసుల్లకు ఇనుపరెక్కలస్తే... అవి దొరికేటియా??"

ఉసుల్లకు ఇనుపరెక్కలు రావాలి... పెత్తరీగల్లెక్క మారాలె... పెత్తరీగల రెక్కలూసి పోయి... ఉసుల్ల లెక్కగావాలె... కాలం గట్లకింది మీదయ్యే రోజులు ముందు ముందున్నయ్... నేను తప్పక జూస్త..." అన్నది కోపంగా.

లింగవ్వ బిడ్డ దిక్కు మెచ్చుకోలుగా చూసింది.

** ** **

గడియారం కింద వడ్డట్టు... కాలం తిర్గబడింది.

నక్సలైట్లు దొర భూముల్ల జెండాలు పాతిండ్రు. దొర గడీ విడిచిపెట్టి కుటుంబంతోసహ పట్నంలో జెండా ఎత్తిండు.

ఊళ్లో... రాజవ్వ పెండ్లి ఘనంగా జరిగింది. మస్కట్ పోయి వచ్చిన శంకర్‌తోని. శంకర్ సాకలి రుకం చెయ్యనని... పట్నం బోయి ఫంక్షన్ ప్యాలెస్ గుత్తవట్టిండు.



పట్నంల కాపురం పెట్టినంక రాజవ్వలో బాగా మార్పొచ్చింది.

ఓరోజు... పెండ్లిల్ల పసుపు కుంకుమలు పడి పాడై... నలిగిపోయిన పట్టుచీరెలన్నీ పది దాకా తీసింది. ఓ డ్రైక్లీనింగ్ షాప్‌కెల్లింది. అక్కడ గంజిలో ముంచి చీరె లారేస్తున్న వ్యక్తిని చూసి నోరు తెరిచింది.

'దొర్సానీ...' అనబోయి... "రాధవ్వా... మీరా?" అంది. లింగవ్వ బిడ్డని తొందరగానే గుర్తుపట్టిన దొర్సాని... అది పేరుపెట్టి పిలిచినందుకు క్షణంపాటు కలవరపడింది.

"నువ్వానే... గీ సిటీల్నే వుంటుండ్రా. ఏం పని మీదచ్చినవ్" అనడిగింది.

"గీ పట్టుచీరెలు ఉతికెయ్యుండ్రి"

ఆ మాటతో దొర్సాని పాణం గిలగిలా కొట్టుకుంది. యినా తమాయించుకొని చీరెలు లెక్కవెట్టి... మౌనంగా బిల్లు రాసిచ్చింది.

> "కులపోల్లం కదబిడ్డ... గట్లనుకుంటరా... దొర్సాని కోడలు నీల్లాడింది. అయిదారునెల్ల దాక పీతిపేగులు, మైలబట్టలు తప్పయ్ బిడ్డా... మనమంటె ఊరికి ఆడిబిడ్డ లెక్క... దీపావళి నాడు మబ్బుల మంగళార్తి పట్టుక పోతె ఇంటికి పదిరూపాయలన్న పెడ్తరు. గీ ముచ్చట్లకేంది గని... జెట్టిన కానియ్ బిడ్డా"

మూడు వందల ఇరవై రూపాయలు!

'గింతనా రాధవ్వా.... ఒపారి మా కుల పోల్లం సంఘం పెట్టి యాభై రూపాయలు పెంచుమన్నందుకు దొర వూరు బందు వెట్టిచ్చె... దప్పు సాటేయించి మా గొడ్డు గోదల్ని చేండ్లల్ల చెలుకల్లి మేపద్దని కట్టడి చేయించె. పెండ్లిల్లు, పేరంటాలకు, పురుల్లు పుట్టెంటికలకు మమ్మల్ని పిలువద్దని... రెండు నెలలు అర్వగోస పెట్టుకుండ్రి... యాది మర్సిపోలే రాధవ్వా... సరెగనీ... ఇంకో యాభై రూపాయలు ఎక్కువ తీసుకున్న మంచిదె... జెరంత మంచిగుతుకుండ్రి..." అంది రాజవ్వ.

"ఇక్కడ ఒక్క పట్టుచీరలే పెట్రోల్‌తో వాష్ చేస్తమే..." దొర్సని మొఖం కందగడ్డ లెక్కవుతుంటే అంది.

"మీ పెనిమిటి ఏం జేత్తుండు రాధవ్వా" అంది.

దొర అననందుకు కోపం వచ్చినా తమాయించుకుంది.

"గోట్ ఫామ్ పెట్టిండే" అంది.

అది అర్థం చేసుకున్న రాజవ్వ... "కాలు మీద కాలేసుకొని రాయమల్లు దగ్గర యాట పిల్లను తెప్పిచ్చే దొర మేకల ఫారం పెట్టిండా? గివ్వన్ని చిన్న కులపోల్లు చేసే పనులు కదా రాధవ్వ..." అంది.

"కాలం ఒక్క తీరుగుంటాదే..." అని కొంచెం కోపంగానే అంది.

"జెరంత మంచిగ ఉతుకుండ్రి... అలేగని రాధవ్వా... గీ కంటిబొమ్మలు లెవల్ చేయించుకోవాలె. ఎక్కడ జేస్తరు" అనడిగింది వయ్యారంగా రాజవ్వ.

"పక్కనే... మా కోడలు పెట్టిందే... మిస్ వరల్డ్ బ్యూటీపార్లరు. ఎప్పుడైనా దాంట్లోకే వెళ్లు" అంది బలవంతంగా నవ్వి.

రాజవ్వ బ్యూటీపార్లర్‌లోకి అడుగుపెట్టేసరికి దొర్సని కోడలు ఎవరికో మసాజ్ చేస్తోంది.

రాజవ్వ ఉలిక్కిపడింది... దొర్సాని కోడల్ని చూసికాదు.

మసాజ్ చేయించుకుంటున్న వ్యక్తిని చూసి.

అది అంజవ్వ కోడలు!!

ఒకప్పుడు ఈ దొర్సాని కోడలికి గోర్లు తీసి వసువునూనెతో రాసిన అంజవ్వ కోడలు. చదువుకొని ఉద్యోగం చేస్తోంది. మసాజ్ పూర్తయ్యాక రెండువందలు బిల్లు చెల్లించిపోయింది.

ఐబ్రోస్ కోసం ఛైర్‌లో కూచున్న రాజవ్వ అనుకుంది.

"ఈ దుకాణం నడిపే దొర్సాని నీల్లాడినప్పుడు అంజవ్వ మంత్రసానితనం నుంచి తల్లి పిల్లకు తలంటుపోసేదాక ఆర్నెల్లు కష్టపడితే ఏం బెట్టిండ్రు? ఓ చీరె... రెండు రైక కనుములు, నూటయాభై రూపాయలు... చిన్న కులపోడు చేస్తే ఓ రేటు... అదే పని వీళ్లు జేస్తె... ఇంకో రేటు" అని రాజవ్వ మనసు తల్లడ మల్లడమైంది.

ఐబ్రోస్ చేయించుకొని బయటికొచ్చిన రాజవ్వ కసిగా అనుకుంది.

'నీ యవ్వ... ఉన్నోడు ఉతికితే డ్రైక్లీనింగ్...
లేనోడు ఉతికితే సాకలి రుకం
ఉన్నోడు తోమితే మసాజు...
లేనోడు తీడితే మంగళిరుకం
అయినా...

**ఉసుల్లకు ఇనుపరెక్కలొస్తున్నయ్... పెత్తరీగల రెక్కలు ఊసిపోతున్నయ్!!**